# బాబుగారి

# డాబు

## తొమ్మిదేళ్ల పాలనపై శ్వేతపత్రం




**వాసిరెడ్డి వేణుగోపాల్**

సీనియర్ జర్నలిస్ట్

# బాబుగారి డాబు

## తొమ్మిదేళ్ల పాలనపై శ్వేతపత్రం

వాసిరెడ్డి వేణుగోపాల్

VASIREDDY PUBLICATIONS

**BABUGARI DAABU**
Vasireddy Venugopal

© Author

*First e-edition:*
**5th July 2014**

**Price: Rs. 120**

*For copies:*
*kinige.com*

*Cartoons & Cover Design*
**Shekar**

*Page Layout*
**A. Thirupathaiah**

*Printed at*
**Impact Printers**
Lakdikapul,
Hyderabad.

# ఇంట్రో

తెలుగుదేశం పార్టీ పట్ల నాకు వ్యక్తిగత వ్యతిరేకత ఏమీ లేదు. ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో వ్యక్తిగత విరోధం కూడా ఏమీ లేదు. తెలుగుదేశం పార్టీపై, ముఖ్యంగా చంద్రబాబుపై పగబూని ఈ రచనలు చేశానని అనుకుంటే పొరపాటు. 1985 నుంచీ పత్రికా రచనే ప్రపంచంగా జీవిస్తున్న నేను, తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కూడా, వారి పరిపాలనా తీరుతెన్నులపై విశ్లేషణాత్మక సంపాదకీయ వ్యాసాలు రాశాను. అయితే అవన్నీ ఒక ఎత్తు. యావత్ ప్రపంచాన్ని సంస్కరణల సూదంటురాయితో ఆకర్షించిన చంద్రబాబు తొమ్మిదేళ్ల పాలనా కాలంలో రాసిన వ్యాసాలు ఒక ఎత్తు. ఆ తొమ్మిదేళ్ల కాలంలో రాసిన వ్యాసాలు, సంపాదకీయ వ్యాఖ్యల్లో కొన్నింటిని మాత్రమే ఇందులో చేర్చగలిగాను. వృత్తిపరంగా ఆంధ్రభూమి దినపత్రికలో పనిచేస్తున్న రోజులవి. ఇవన్నీ ఆంధ్రభూమిలోనే అచ్చయ్యాయి.

అన్ని ఇజాలకు కాలం చెల్లిందని సూత్రీకరించిన చంద్రబాబు, 2004 ఎన్నికల్లో అపోజిషన్ బెంచీలకు పరిమితమైనప్పటికీ బాబిజాన్ని ప్రదర్శించడంపైనా ఒకటి రెండు వ్యాసాలున్నాయి. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించడంలో వైఫల్యానికి సంబంధించినవి ఆ వ్యాసాలు.

నా పన్నెండో ఏట దేశంలో ఎమర్జెన్సీ వచ్చింది. అప్పటినుంచీ రాజకీయ పరిణామాలను గమనిస్తున్న నేను, వ్యవసాయం దండగ అని సాహసించి చెప్పగలిగిన ముఖ్యమంత్రిని చంద్రబాబులోనే చూడగలిగాను. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందుల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి బదులు, పంటమార్పిడి లేకపోవడమే అన్ని అనర్థాలకు మూలం అంటూ వందలమార్లు వల్లించిన ముఖ్యమంత్రిని కూడా చంద్రబాబులోనే చూడగలిగాను. రెండు రూపాయల కిలో బియ్యం పథకానికి నిధులకోసం

అవసరమైతే జోలె పడతానని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అన్నారు. కానీ ఎన్టీఆర్ స్థానంలోకి వచ్చిన చంద్రబాబు, తనను తాను ప్రజాసేవకుడిగా చెప్పుకోవడానికి సిగ్గుపడ్డారు. ప్రతి పనిలోనూ లాభం ఆర్జించడానికి ఇష్టపడే సీఈఓగా తనను తాను చాటుకుని, అంతర్జాతీయ రుణదాతల బాజాభజంత్రీల మోతలతో పులకరించి పోయిన ముఖ్యమంత్రిని కూడా చంద్రబాబులోనే చూడగలిగాను. ఇలా ఏనాడూ ఎవరూ ఎరగని ముఖ్యమంత్రిగా, రాజకీయ నాయకుడిగా చంద్రబాబు అధికారం తొమ్మిదేళ్లు కొనసాగింది. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అదొక సంధికాలం.

ఇన్నేళ్ల తర్వాత ఆ కాలపు సమీక్ష ఎందుకంటే.. ప్రజా పునాదులపై నిలవాల్సిన, గెలవాల్సిన నాయకులు... తమ సొంత ఇజాలకు ముద్దుపేర్లు అద్దుతూ, జనం మీద వదులుతూ, వారిని నయవంచనకు గురిచేస్తూ ఎల్లకాలం ఏలలేరని గుర్తుచేయడానికి. నడమంత్రపు సిరికి అచ్చమైన ప్రతినిధులుగా వ్యవహరిస్తూ ఎల్లకాలం యావత్ జనాన్ని ఏమార్చలేరని అన్ని రాజకీయ పార్టీలకు, వాటి నాయకులకు గుర్తుచేయడానికి ఈ పుస్తకం. ఒకానొక చారిత్రక సందర్భంలో ఒకానొక ప్రభుత్వం ఏం చేసింది, ఏం చేయకుండా వుండాల్సింది, ఏం చేయలేదు, ఏం చేసి వుండాల్సింది అని తెలుగుదేశం సహా అన్ని పార్టీలు ఆలోచించుకోవడానికి, ఆత్మపరిశీలన చేసుకోవడానికి, తెలుగు ప్రజానీకపు అభ్యున్నతికి తోడ్పడే విధానాలు రచించుకోవడానికి దోహదపడుతుందనే నమ్మకంతో ఈ పుస్తకం.

సరిగ్గా మూడేళ్ల క్రితం ఈ పుస్తకం 'నారాజ్యం' పేరిట అచ్చులో వచ్చింది. పాఠకుల ఆసక్తిని దృష్టిలో వుంచుకొని రివైజ్డ్ ఎడిషన్‌ను ఈ-బుక్ రూపంలో అందిస్తున్నా. మునుపటిలాగే ఆదరిస్తారని ఆశిస్తా.

**- రచయిత**

# ఇండెక్స్


| | |
|---|---|
| చతికిలపడిన చంద్రబాబు | 7 |
| దిక్కు కానని పొగాకు రైతు | 10 |
| అప్పుల ఊబిలో 'ఆదర్శ' రాష్ట్రం | 13 |
| వాతలెట్టి జోలపాట | 16 |
| దగాపడిన రైతు | 19 |
| జనం అంటే భయం! | 22 |
| అరచేతిలో సైబర్ స్వర్గం | 25 |
| మాయదారి రాయబారం | 28 |
| ఇదీ బాబు పనితనం! | 31 |
| విద్యుత్ దారిలో విద్య? | 34 |
| 'సీమ' పంటకు నిర్లక్ష్యం తెగులు | 37 |
| నేల విడిచి సాము | 40 |
| అప్పుడే కరంటు కష్టాలా? | 43 |
| నట్టేట ముంచిన నకిలీ విత్తనం | 46 |
| కరంటు 'కోత'లు | 49 |
| చేతి చమురు భాగస్వామ్యమే | 52 |
| ఇచ్ఛంపల్లిపై రచ్చ | 55 |
| వేటుకు సిద్ధమయ్యాక సలహా చెవికెక్కుతుందా? | 58 |
| దా'రుణా'ంధ్రప్రదేశ్! | 63 |
| మద్య వ్యతిరేక ఉద్యమం ఏమైనట్టు? | 66 |
| కరవు రాజకీయం | 69 |
| కార్మిక సంఘాలకు జయం | 72 |
| ఈసారీ తాటాకు చప్పుళ్లేనా? | 75 |
| విద్యుత్ వాతలు | 78 |
| బాబు అప్పులు...జనం తిప్పలు | 81 |

| | |
|---|---|
| నీటిమూట ప్యాకేజి | 84 |
| మరీ ఇంత దారుణమా? | 87 |
| నగరవాసులపై మరో భారం | 90 |
| జగడాల జన్మభూమి | 93 |
| పరోపకారి చంద్రన్న! | 96 |
| విద్యుత్ ఆందోళన.. మౌలిక ప్రశ్నలు | 99 |
| ఆత్మస్తుతి, పరనింద | 102 |
| రివర్సు గేరులో ఆర్టీసీ | 105 |
| రైతు కంట్లో కారం | 108 |
| నీరు మీరు.. రైవాడ పైరు | 111 |
| వడ్డించని విస్తరి | 114 |
| ఓటి ఒప్పందాలు | 117 |
| పేరు గొప్ప బడ్జెట్ | 120 |
| అప్పులకే పెద్దపీట | 123 |
| సింగరేణి సమ్మెట | 126 |
| పాలమూరు కన్నీరు | 129 |
| అరకొర సాయం | 132 |
| ప్రైవేటుకు టోకు విక్రయం | 135 |
| తప్పు సర్పంచ్‌లదా? | 138 |
| ఆపద మొక్కులు | 141 |
| ఎక్కడి గొంగళి అక్కడే | 144 |
| ఇదెక్కడి విపక్షం ?! | 147 |
| ఏలేరు దోషులెవరు? | 150 |
| విఫల విపక్షం | 153 |
| గురివింద బాబు వల్లించిందే వేదం.. | 156 |
| తుస్సుమన్న 'దేశం' | 160 |

# చతికిలపడిన చంద్రబాబు



**వాజపేయి హయాంలో కేంద్ర బడ్జెట్‌లో రాయితీల కోసం రాయబారం నడిపినా ఫలించకపోవడంతో చంద్రబాబు కన్నెర్ర చేశారు. కేంద్రంతో అమీతుమీ తేల్చుకుంటానని జబ్బలు చరిచారు. అంతే తప్ప సబ్సిడీ బియ్యం పథకం అమల్లో తన వైఫల్యాల పర్యవసానమే తనకు గుదిబండగా మారిందని గుర్తించలేదు. కేంద్రంపై ఆయన పోరాటం గురివింద సామెతను గుర్తుకుతెస్తుంది.**

రాష్ట్రానికి తాను ముఖ్యమంత్రిని కాదని, పరిపాలనను లాభసాటిగా నిర్వహించే సమర్థుడైన చీఫ్‌ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌నని భుజకీర్తులు తగిలించుకున్న చంద్రబాబు, ఇప్పుడు దివాలా తీసిన కంపెనీని బిఐఎఫ్‌ఆర్‌కు నివేదించినట్లు కేంద్రం ముందు మోకరిల్లడం చూస్తే తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఎంత లోపభూయిష్టమైనవో, అవి రాష్ట్రాన్ని ఎంత అధోగతి పాల్జేస్తున్నాయో అవగతమౌతుంది. తన కొలువులోని వారికి నెలనెలా జీత భత్యాలే చెల్లించలేని స్థితిలో వుండి కూడా వ్యక్తిగత ప్రచారార్భాటానికి మాత్రం కోట్లు తగలేస్తున్న ముఖ్యమంత్రి, ఖజానా పూర్తిగా ఖాళీ కావడంతో దిక్కుతోచని స్థితిలో వున్నారన్నది వాస్తవం. అప్పోసప్పో చేతిలో గవ్వలు గలగలలాడినంతకాలం రాష్ట్ర స్థాయిలో సంస్కరణల అమల్లో తనంత మొనగాడు లేడని, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు తనను ఆదర్శంగా తీసుకోవాలని బీరాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు హఠాత్తుగా ప్లేటు మార్చేసి కేంద్రాన్ని శాపనార్థాలు పెట్టడం విచిత్రం.

రాష్ట్రానికేవో రాయితీలు ఆశించి రెండు వారాల క్రితం ఢిల్లీ యాత్ర సాగించి, అక్కడ భంగపడిన నాటినుంచి చంద్రబాబు వైఖరిలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా పార్లమెంట్‌కు సమర్పించిన బడ్జెట్ ఆహార ధాన్యాల సబ్సిడీని కుదించడం పుండుమీద కారం చల్లినట్టయింది. అందుకే చంద్రబాబులో ఇప్పుడు తెలుగుదేశం ఆవిర్భావనాటి ఎన్టీఆర్ కనిపిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం కేంద్రంతో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమేనని కాలు దువ్వుతున్నారు. కానీ చంద్రబాబు పాలనా గతాన్ని పరిశీలించినప్పుడు ఇదెంత హాస్యాస్పదమో వేరుగా చెప్పనక్కర్లేదు. తానొవ్వక, పరులనొప్పించక లోపాయకారీగా కార్యం సాధించడమే తెలిసిన చంద్రబాబుకు ఇలా పోరాడవలసిన పరిస్థితి రావడం చూస్తే సానుభూతి కలగక మానదు. అయితే ఇది పూర్తిగా

ఆయన స్వయం కృతాపరాధం.

తెలుగుదేశం పార్టీకి సబ్సిడీ బియ్యం పథకం ఓట్లు కుమ్మరించే కామధేనువనడంలో సందేహం లేదు. ఎనభయ్యో దశకం ప్రారంభంలో ఎన్టీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టేనాటికి మార్కెట్ ధరకు, రేషన్ ధరకు వ్యత్యాసం స్వల్పం. ఎన్టీఆర్ రెండు రూపాయలకు ఇస్తానన్న బియ్యాన్ని రూపాయి తొంభై పైసలకే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి చూపింది. అయితే రాష్ట్రంలో దారిద్ర్య నిర్మూలనకు అనుసరించాల్సిన విధానం ఇది కాదని, మార్కెట్ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేయగలిగే విధంగా పేదల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాలని కాంగ్రెసే కాదు, అందరూ హితవు చెప్పారు. ఇవేవీ తెలుగుదేశాధినేతలకు ఆనాడు తలకెక్కలేదు. ఈనాటికీ పరిస్థితిలో మార్పులేదు. చివరికి సబ్సిడీ బియ్యం పథకం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా తయారయినా, ఈ పథకం కారణంగా లెక్కల్లో పేదలసంఖ్య తగ్గిపోయి లక్డావాలా ఫార్ములా ప్రకారం కేంద్రంనుంచి కేటాయింపులు కుదించుకుపోయినా చంద్రబాబుకు కనువిప్పు కాలేదు. సంస్కరణల గురించి అంతర్జాతీయ వేదికలపై ఉపన్యాసాలు దంచే చంద్రబాబు అవే సంస్కరణల పేరిట ఆహార సబ్సిడీలను కుదిస్తే మాత్రం ససేమిరా అనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సబ్సిడీ బియ్యం పథకం రాష్ట్రంపై ఇప్పటికే 1100 కోట్ల రూపాయల భారాన్ని వేస్తున్న మాట యదార్థం. యశ్వంత్ బడ్జెట్ ప్రతిపాదనల పుణ్యమా అని మరో 400 కోట్ల రూపాయల భారాన్ని నెత్తినెత్తుకోవాల్సిన పరిస్థితి. అప్పుల ఊబిలో, వడ్డీల చక్రబంధంలో చిక్కుకున్న రాష్ట్రం కొత్త భారాన్ని తట్టుకోలేదని చంద్రబాబు ఆర్తనాదాలు చేయడానికి ఇదేమీ అనూహ్య పరిణామం కాదు. సబ్సిడీ బియ్యం పథకం ఇంత భారంగా పరిణమించడానికి బోగస్ రేషన్ కార్డులు కారణమని గుర్తించి ఏళ్లు గడుస్తున్నా, వాటిని ఏరివేయడానికి చంద్రబాబు చూపిన రాజకీయ సంకల్పం ఏమాత్రమో జగద్విదితం. తాను ప్రవచిస్తున్న సంస్కరణల అనంతర పరిణామాలను ఊహించలేనంత అజ్ఞానంలో, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించలేనంత అసమర్థతతో చంద్రబాబు వున్నారని దీనినిబట్టి అర్థం చేసుకోవాలా? విదేశీ పెట్టుబడులు ఎల్లలుదాటి రాష్ట్రంలోకి ప్రవాహంగా ప్రవేశిస్తున్నట్టు అధికారం చేపట్టిన నాటినుంచి ఊదరగొడుతున్న చంద్రబాబు ప్రోటాన్ కార్ల ఫ్యాక్టరీ మొదలుకుని, గోచాక్‌టాంగ్ హైదరాబాద్ పర్యటన వరకూ తన వ్యక్తిగత ప్రచార పటాటోపంలో ఎంత బావుకున్నారో తెలియదుకానీ, రాష్ట్రానికి ఒరిగింది మాత్రం శూన్యం. హైటెక్ ముఖ్యమంత్రిగా కీర్తిని



సంస్కరణల అనంతర పరిణామాలను ఊహించలేనంత అజ్ఞానంలో, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించలేనంత అసమర్థతతో చంద్రబాబు వున్నారని దీనినిబట్టి అర్థం చేసుకోవాలా?



ఏపూటకు ఆపూట పబ్బం గడిచిందే చాలన్న
రీతిలో వ్యవహరించే చంద్రబాబు,
విజన్ 2020 పేరిట బృహత్తర దీర్ఘకాలిక
ప్రణాళికను రూపొందించడం, ఇదే పద్ధతిని
ఇతర రాష్ట్రాలు, కేంద్రం పాటించాలని
సలహా ఇవ్వడమే ఆశ్చర్యకరం.

సముపార్జించుకున్న చంద్రబాబు అటు సంప్రదాయక పారిశ్రామిక రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, అవి మూతపడుతున్నా పట్టించుకోలేదు. పోనీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం నుంచి ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చుతున్నారా అంటే అదీ లేదు. ఏపూటకు ఆపూట పబ్బం గడిచిందే చాలన్న రీతిలో వ్యవహరించే చంద్రబాబు, విజన్ 2020 పేరిట బృహత్తర దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించడం, ఇదే పద్ధతిని ఇతర రాష్ట్రాలు, కేంద్రం పాటించాలని సలహా ఇవ్వడమే ఆశ్చర్యకరం.

ఆహార సబ్సిడీల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేశారంటూ కేంద్రాన్ని తప్పుపడుతున్న చంద్రబాబు, తాను మాత్రం గురివింద నీతిని పాటించడం విడ్డూరం. కేంద్ర నిధులకు, పథకాలకు తనదైనముద్ర వేసుకుని బండి నడిపిస్తున్న చంద్రబాబు స్థానిక సంస్థలకు న్యాయంగా చెందాల్సిన నిధులను మాత్రం చెల్లించకుండా ఖర్చు చేసేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు చెక్కులపై సంతకం చేసే అధికారాన్ని కట్టబెట్టడానికే నిరాకరించారు. భవనాల క్రమబద్ధీకరణ ద్వారా మున్సిపాలిటీలకు దక్కాల్సిన ముప్పాతిక కోట్లను ముల్లె కట్టుకున్నారు. ఆంధ్రులు ప్రాణత్యాగంతో సంపాదించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టుకునేందుకు కేంద్రంతో కయ్యానికి సిద్ధమంటున్న చంద్రబాబు, ఆందోళనకు దిగిన ఫ్యాక్టరీ కార్మికులపై లాఠీలను ఝుళిపించారు. అధికారాలు, నిధుల బదలాయింపులో తానొకరకంగా, కేంద్రం మరోరకంగా వ్యవహరించాలనుకోవడం చంద్రబాబులోని ద్వంద్వ నీతికి దర్పణం. ప్రతిదానికి కేంద్రాన్ని నిందించే ధోరణి చంద్రబాబులో ఎంతగా ప్రబలిందంటే తీవ్రవాదాన్ని అరికట్టడానికి వెచ్చిస్తున్న మొత్తాన్ని కేంద్రం భరించనందునే నక్సలైట్ల మారణకాండకు మంత్రి మాధవరెడ్డి బలి కావాల్సి వచ్చిందని నిందించేవరకూ వెళ్లింది. చంద్రబాబు తాజా ధోరణి ద్వారా ఒక విషయం మాత్రం స్పష్టమవుతోంది. కేంద్రంతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు నడపడం ద్వారా బండిని నెట్టుకురావాలని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తోంది. రెండవసారి రాజమార్గంలో గద్దెనెక్కగలిగిన చంద్రబాబు పాలనా చాతుర్యం ఆరునెలలకే హారతి కర్పూరంలా కరిగిపోవడం చూస్తే మిలిగిన నాలుగున్నర ఏళ్లూ ఈయన చిల్లుపడిన ఆర్థిక నావను ఇప్పటి సంక్షోభ సంద్రంలో ఎలా నడుపుతారనే అనుమానం మిగులుతుంది.

***10 మార్చి 2000***

# దిక్కు కానని పొగాకు రైతు



**వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించే విషయంలో చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే. పంట మార్పిడితోనే రైతులకు విముక్తి అనే సిద్ధాంతాన్ని ఒంటబట్టించుకున్న నారావారు, పొగాకు సంక్షోభం విషయంలో తాను చేయాల్సింది చేయక ఢిల్లీపై నిందమోపి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు.**

నెలరోజులుగా క్రయవిక్రయాలు లేక వేలం కేంద్రాలు వెలతెలపోతున్నా ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడంతో రాష్ట్రంలోని పొగాకు రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ ఏడాది అవసరాలు పదికోట్ల కిలోలు కాగా, పాత నిల్వలు, అదనపు దిగుబడి కలిపి మరో ఎనిమిది కోట్ల కిలోల పొగాకు మిగులు తేలడంతో పొగాకు కంపెనీలు అసలు కొనుగోళ్లే జరపకుండా రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. రాష్ట్రంలో లక్షలాది రైతులకు జీవనాధారంగా వున్న పొగాకు సాగుపై ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలకు ఈ పరిస్థితి అద్దం పడుతోంది. అవసరానికి మించి దిగుబడి అయినప్పుడల్లా రైతులను నిందిస్తున్న ప్రభుత్వం, అందుకు దోహదం చేస్తున్న అంశాలను అర్థం చేసుకోవడంలో, వాటిని నివారించడంలో ప్రదర్శించిన అలసత్వమే నేటి సంక్షోభానికి కారణం. పంట విరామం ప్రకటించడం ద్వారా పొగాకు బోర్డు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తే ఏకాభిప్రాయం కుదరలేదనే పేరిట నిర్ణయాన్ని మరో వారం వాయిదావేసి రైతాంగంలో అనిశ్చితిని మరింత పెంచింది. అసెంబ్లీలో ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర రాజధానిలో రైతు ప్రతినిధులు ఆందోళన చేస్తున్నా పొగాకు రైతులకు పరిష్కారం మాత్రం శూన్యం. పంట విరామం వైపే మొగ్గు చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇక ఈ సమస్యను ఢిల్లీలో తేల్చుకుందామంటూ బయలుదేరదీస్తున్న ప్రతినిధి బృందాలపైనే ఇప్పుడు రైతులు పుట్టెడు ఆశలు పెట్టుకున్నారు. ప్రధానమంత్రి వాజపేయికి, ఆర్థికమంత్రి యశ్వంత్‌సిన్హాకు, వాణిజ్య మంత్రి మురసోలి మారన్‌కు ముఖ్యమంత్రి స్వయాన లేఖలు రాసినా కానరాని పరిష్కారాన్ని ఈ ప్రతినిధి బృందం ఏమేరకు సాధిస్తుందనే సందేహాలున్నా రైతాంగానికి మరో మార్గాంతరం లేని దుస్థితి.

ఏడాదిపాటు పంట వేయకుండా వుండడానికి రైతు సిద్ధపడుతున్నాడంటేనే సంక్షోభం తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పేరుకుపోయిన నిల్వలను కిలోకు కనీసం యాభై రూపాయల

చౌప్పున అమ్ముకోగలగాలంటే ఇంతకు మించి మెరుగైన మార్గం లేదని రైతాంగం భావిస్తోంది. ఇది ఎంత కఠినమైన నిర్ణయమో రైతాంగానికి తెలుసు. ప్రత్యామ్నాయ పంటవైపు మళ్లడంలో సాధక బాధకాలకు తోడు పొగాకు సాగుపై ఆధారపడి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిర్మించుకున్న బారన్లను, ఇతర ప్రాసెసింగ్ ఏర్పాట్లను ఏడాదిపాటు మూతపెట్టడం రైతును కుంగదీస్తుంది. వీటన్నింటికీ రైతులు సిద్ధపడినప్పటికీ, పొగాకు బోర్డు సమస్యను నాన్చుతోంది. రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా పొగాకు కంపెనీల కొంగుకు బోర్డు ముడి వేసుకుపోయిందనే ఆరోపణలకు బలం చేకూర్చేలా దాని పనితీరు వుందన్నది వాస్తవం. హైదరాబాద్‌లో మార్చి 27న బోర్డు సమావేశం ఒక పేరుమోసిన పొగాకు కంపెనీకి చెందిన ఫైవ్‌స్టార్ హోటల్‌లో జరగడం కాకతాళీయమే కావచ్చు. కానీ బోర్డు సభ్యులలో నిజమైన రైతులకు సముచిత ప్రాతినిధ్యం కొరవడడం యాదృచ్ఛికం కాదు. పంట విరామంపై హైదరాబాద్ సమావేశంలో తుది నిర్ణయానికి రాలేకపోయిన పొగాకు బోర్డు ఏప్రిల్ మూడవ తేదీకి వాయిదా వేసింది. పంట విరామంపై ఆంధ్ర, కర్నాటక రైతులు ఏకాభిప్రాయానికి రాలేకపోయినందున నిర్ణయాన్ని వాయిదా వేసినట్టు వంక చెబుతోంది. దేశంలో పొగాకు దిగుబడిలో ఆంధ్రప్రదేశ్ వాటా ఎనభైశాతం కాగా, కర్నాటకది దాదాపు ఇరవై శాతం. కాబట్టి కర్నాటక అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే. సమస్య అందరిదయినందున పంట విరామంవైపు కర్నాటక రైతులు మొగ్గుచూపారు. కానీ కొత్త పంటకు నారువేయడం మొదలైపోయినందున తాము నష్టపోతామని హైదరాబాద్ సమావేశంలో మాట మార్చారు. ఈ ఏడాదికి ఆంధ్రలో పంట విరామం పాటించి, ఆపై ఏడాది కర్నాటకలో పాటించాలనే ఆలోచన వచ్చినా ఆచరణ సాధ్యంగా కనిపించలేదు. వెరసి నిర్ణయం వాయిదా పడింది.

మునుపెన్నడూ లేనంతగా రాష్ట్ర పొగాకు రైతులు సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రధాన కారణం పెరిగిన విస్తీర్ణం అని నిందించడం నిర్హేతుకం. తమ అవసరాలు ఏ పాటివో పొగాకు కంపెనీలు తెలియజేసిన తరువాతనే ఆ మేరకు సాగుచేయడం ఆనవాయితీ. అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు అందించి, అదనపు ఉత్పత్తిని కంపెనీలే ప్రోత్సహించి ఆనక కొనుగోళ్లు చేయక ధరలను తొక్కిపెట్టే కుయుక్తి కూడా కొన్నేళ్లుగా ఒక పద్ధతి ప్రకారం సాగుతోంది. ఇందులో ప్రభుత్వాల పాత్ర తక్కువదేమీ కాదు. పొగాకు పంట విస్తీర్ణాన్ని, దిగుబడిని నియంత్రిస్తూ, రైతులపై పెనాల్టీల ద్వారానే కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న



పొగాకు పంట విస్తీర్ణాన్ని, దిగుబడిని నియంత్రిస్తూ, రైతులపై పెనాల్టీల ద్వారానే కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న ప్రభుత్వం, అధిక దిగుబడిని ఆసరాగా తీసుకుని లాభాలు పండించుకుంటున్న పొగాకు కంపెనీలను అదుపులో పెట్టే ప్రయత్నం చేయకపోవడం గర్హనీయం.

ప్రభుత్వం, అధిక దిగుబడిని ఆసరాగా తీసుకుని లాభాలు పండించుకుంటున్న పొగాకు కంపెనీలను అదుపులో పెట్టే ప్రయత్నం చేయకపోవడం గర్హనీయం. బడా సిగరెట్ కంపెనీలు పొగాకు ధరలను శాసించే వాతావరణం నెలకొన్నప్పుడు రైతులను ఆదుకోవాల్సిందిపోయి, సమస్య పూర్తి పరిష్కార బాధ్యత కేంద్రానిది, పొగాకు బోర్డుదేనన్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం విచారకరం. పంట విరామం పాటించాలనే రైతాంగం డిమాండ్‌తో ఏకీభవించడం మినహా సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టంగా చేసింది స్వల్పమనే చెప్పాలి. తాను ఇష్టపడిన రంగాలకు విదేశీ మార్కెట్లు కల్పించడంలో అలుపెరుగని ముఖ్యమంత్రి చంద్రబాబు, పొగాకు ఎగుమతుల విషయంలో మాత్రం ఇంతకాలం అశ్రద్ధ చూపారు. విదేశీ కంపెనీలు ఇక్కడి వేలం కేంద్రాలలో నేరుగా పాల్గొని కొనుగోళ్లు చేయడానికి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చేస్తున్న ఆలోచన రైతాంగాన్ని పెనంలోంచి పొయ్యిలోకి తోయడం ఖాయం.

గతంలో మన పొగాకుకు సోవియట్ యూనియన్‌లో మంచి గిరాకీ వుండేది. పొగాకు కొనుగోలుకోసం సోవియట్‌కు రుణాలు ఇచ్చిన సందర్భాలు కూడా వున్నాయి. సోవియట్ విచ్ఛిన్నానంతరం పరిస్థితులు మారిపోయాయి. చైనా మార్కెట్ ఆదుకుంటుందనే నమ్మకాలు కూడా వమ్మయ్యాయి. సరుకు ఎంత నాణ్యమైనదైనా అమెరికా వంటి మార్కెట్లలో ప్రవేశించడం సులభం కాదు. తప్పాతాలంతా పోగుచేసి ఎగుమతులు చేసిన వ్యాపారులు కూడా విదేశీ మార్కెట్‌లో మన పొగాకుకు గిరాకీ తగ్గడానికి ఒక కారణం. పొగాకు సాగు, వినియోగానికి వ్యతిరేకంగా అంతర్జాతీయంగా వస్తున్న ధోరణులను అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక ప్రభుత్వాలు సరిగ్గా అర్థం చేసుకోకపోవడం కూడా ఈ సంక్షోభాన్ని మన ముందుంచింది. ఆంధ్రప్రదేశ్ రైతులు, అలాగే ప్రభుత్వం కోరుతున్నట్టు పంటవిరామం ప్రకటించడం తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని స్పష్టం. పంటవిరామం ప్రకటించినా, దిగుమతులను నిరోధించకపోతే ప్రయత్నమంతా నిష్ఫలమవుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ సమస్యను ఈ ఏడాదికి పరిమితమైనదిగా పరిగణించి పూత మందులతో సరిపెట్టుకుంటే పొగాకు రైతాంగం ఎన్నటికీ కోలుకోలేదు. పొగాకు బోర్డు ఇప్పుడు అలాంటి పనిలోనే నిమగ్నమై వుందని రైతులు విస్మరించరాదు. పొగాకు సాగు, మార్కెటింగ్‌లో ఎదుర్కోబోయే ఇబ్బందులను గుర్తించడంలో తమతోపాటు ప్రభుత్వాలు కూడా విఫలమైన ఫలితంగానే ఈ సంక్షోభం ఏర్పడిందని రైతులు గుర్తించాలి. వాణిజ్య పంటలను పండించే రైతాంగం సమస్యలు ఒక విషవలయం లాంటిది. అంతర్జాతీయ మార్కెట్ ధోరణులను బట్టి ఈ రైతాంగం ఆకాశానికి ఎగియడమో, అధ:పాతాళానికి పడిపోవడమో జరుగుతోంది. ఈ భయానక ఆటుపోట్లకు బక్కరైతు బలైపోతున్నాడు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి రైతాంగాన్ని గట్టెక్కించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

***31 మార్చి 2000***

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Babugari+Dabu**

* * *